


## ( 1967 లో ఆంధ్రప్రభలో సీరియల్ గా వచ్చిన నవల పునర్ముద్రణ)

(గత సంచిక తరువాయి)

**మద్రాసు చేరిన** మరునాడే నరసింహం ఉద్యోగంలో చేరాడు. వీరభద్రయ్య ఇంజనుల గురించి ఇంగ్లీషులో వ్రాసిన పుస్తకం ఒకటి నరసింహానికి ఇచ్చాడు. ఆపుస్తకం చదవమని, బోధపడని విషయాలు అడగమని చెప్పాడు. ఇంజనుభాగాలపేర్లు, ఏ ఏ భాగం ఏ విధంగా పనిచేస్తుందో బొమ్మలతో కూడా విశదంగా ఆ పుస్తకంలో వివరించారు. రెండు మూడు నెలల్లో డ్రైవర్ల దగ్గిర పనిచేసే రెండవ ఫైర్ మనుల ఖాళీలు భర్తీ చేయవలసింది ఉందని వీరభద్రయ్య చెప్పాడు. చదువుకున్నవాళ్లకు ఆపని దొరకడం కొంచెం సులభం. ఆపని దొరికిన వాళ్లకు పైమెట్లు ఎక్కడానికి అవకాశాలుంటాయి. డబ్బుకూడా కొంచెం హెచ్చు దొరుకుతుంది. శ్రమ మాత్రం అధికంగా ఉంటుంది.

నరసింహానికి బాగా పని తగిలింది. వీరభద్రయ్య శ్రమపడి నరసింహానికి నేర్చుకోవలసిన విషయాలన్నీ చెబుతున్నాడు. ఉచ్చారణలోగల దోషాలు సవరించేవాడు. విజ్ఞానశాస్త్ర విషయాలు సులువుగా బోధపడేటట్టు ఉదాహరణలు ఇచ్చేవాడు. శాస్త్రీయమైన విషయాలు తెలియనిది, రైలు ఇంజను గురించి తెలుసుకోవడం కష్టం. ప్రశ్నలు చెప్పి, జవాబులు నరసింహం చేత వ్రాయించి, వాటిలో తప్పులు దిద్ది, సరియైనవాటిని కంఠస్థం చేయించేవాడు. నరసింహాన్ని పైకి తీసుకొనిరావడానికి ఆయన దృఢంగా సంకల్పించాడు.

రాత్రి వీరభద్రయ్య దగ్గిర ఇంజనులను గురించి చదవడం, పగలు ఆ విషయాలన్నీ సమగ్రంగా పరిశీలించడం కొనసాగించాడు నరసింహం. డ్రైవర్లను అడిగి ఇంజనుల గురించి తెలుసుకునేవాడు. వాళ్లు అనుభవం మీద చెప్పినవిషయాలు, తను పుస్తకంలో చదివిన సంగతులు ఎంతవరకు సమన్వయించేవో ఆలోచించేవాడు. భేదం వచ్చినప్పుడు తాను నేర్చుకున్న విషయాలను గురించి ప్రసంగించేవాడు. వాళ్లలో కూడా శాస్త్రపరిజ్ఞానం లేనివాళ్లు ఉన్నారు. నరసింహం చెప్పిన సంగతులు వాళ్లకు ఆశ్చర్యం కలిగించేవి. చదువుకున్నవారితో ప్రసంగించినప్పుడు, వాళ్లు నరసింహం చెప్పినవాటిని విని, కొత్త విషయాలు కూడా చెప్పేవారు. ఒకరిద్దరు మాత్రం ఇతని ప్రసంగం విని, కూలీలు అంత హెచ్చుగా అనవసరమైన విషయాలను గురించి ప్రసంగం చేయడం తమ వంటి పెద్ద ఉద్యోగులకు అవమానకరమని అన్నారు.

ఒక ఆదివారం నరసింహం మాధవరావు ఇంటికి వెళ్లాడు. అతను డ్రాయింగురూములో కూర్చుని, మరొకరితో మాట్లాడుతున్నాడు. రెండవ అతను సన్నని పంచెకుచ్చెళ్లు బాగా వేలాడేటట్టు కట్టుకున్నాడు. బెంగాలీచొక్కా తొడుక్కున్నాడు. మధ్యపాపిడి తీసుకున్నాడు. హెచ్చుగా ఉన్న జుత్తు మాటిమాటికి వెనక్కి తోసుకుంటూ జారిపోతున్న వల్లెవాటుగా వేసుకున్న వాణీ సరిచేసుకుంటూ, సన్ననిగొంతుకతో అతను ఏవో పద్యాలు మాధవరావుకి వినిపిస్తూన్నాడు.

నరసింహం అక్కడ కాళీగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. కొత్త అతనిని మాధవరావు పరిచయం చేశాడు.

"నరసింహం! వీరు మా స్నేహితులు. భైరవశాస్త్రి గారు. మంచి కవులు."

నరసింహం అతనికి నమస్కారం చేశాడు.

భైరవశాస్త్రి ప్రతి నమస్కారం చేసి అన్నాడు, "నేడు సుదినం. నూతన మిత్రుల పరిచయభాగ్యం కలిగింది. మీ మిత్రులు, మా మిత్రులు."

"మా నరసింహం కూడా నాలుగయిదేళ్లు సంస్కృతాంధ్రాలు చదువుకున్నాడు. పద్యాలుకూడా వ్రాస్తాడని అనుకుంటాను."

"ఏదో ఎండాకాలం చదువు. నిరర్థకమైనది. పద్యాలు వ్రాయడం మాబోటివాళ్లకు సాధ్యమా?"

“ఉత్తమమైన సంస్కారమున్న మీవంటివారికి కవిత్వం రాకుండా ఉంటుందా? మాధవరావుగారి స్నేహితులు మీరు. మీకు కవిత్వంమీద, సాహిత్యంమీద అభిమానం లేదంటే మేము అంగీకరిస్తామా?"

"అభిమానమున్నంత మాత్రాన వచ్చునని లేదే" అన్నాడు నరసింహం.

“అందరూ వ్రాసేవాళ్లయితే, ఆదరించేవాళ్లు ఉండవద్దూ! అర్థం చేసుకునేవాళ్లు ఉండవద్దా? తనకోసమే కాళిదాసు శాకుంతలం వ్రాసి ఉంటే అతని పేరు నేడు మనకు వినిపించి ఉండదేమో!"

"అయితే భైరవశాస్త్రిగారు!... మీరుకూడా కాళిదాసువలె అందరికోసం వ్రాస్తున్నారా?" అని అడిగాడు మాధవరావు.

"మొదట నా ఊహాసుందరికని వ్రాశాను. మీవంటి వారికి వినిపిస్తుంటాను. నాకు కాళిదాసు నవుదామని కోరిక లేదుగాని, నా కవిత్వాన్ని ఆమోదించేవారిని గురించి వెదుకుతూంటాను. ఒక్కొక్కప్పుడు అనుకుంటాను నా పద్యాలు ఇంకొకరి కెందుకని. అలా అని వ్రాయడం మానలేను. ఎప్పుడు వ్రాస్తానని కూడా చెప్పలేను. అనుకోకుండా భావాలు ముసురుకొని వస్తాయి. వాటినెలా కాదంటాను? నాకు మల్లే అందరికీ భావాలు రారాదూ! వస్తే ఏం జరుగుతుంది?... మనిషి ఒక్కొక్కరు పదేసి పుస్తకాలచొప్పున వ్రాసి ప్రపంచం పుస్తకాలతో నింపివేసేవారు."

“భావాలు అందరికీ రావచ్చు. గాని ఏ కొద్దిమందో రచించగలరు. రచయితలలో చాలా కొద్దిమంది మాత్రమే లోకాదరణకు పాత్రులవుతారు" అన్నాడు మాధవరావు.

“సాహిత్యం మీద అభిమానం ఉన్నవాళ్లు చాల తక్కువ. అర్థం చేసుకున్న వాళ్లు అంతకన్న తక్కువ. ఆధారం ఉండి అర్థం చేసుకునే సామర్థ్యం ఉన్నా, ఉద్యోగాలవల్ల అవకాశాలు లేనివాళ్లు చాలామంది ఉన్నారు. సాహిత్యంమీద మోజు రోజురోజుకి తగ్గిపోతున్నది" అన్నాడు నరసింహం.

"మీరలా అంటే నేనేం చేస్తాను? సూర్యుడిలో తపనశక్తి, చంద్రుడిలో శీతలత, సాగరతరంగాలఘోష ఇవన్నీ నిత్యమైనవికావా? ఇంద్రధనువు ఆకర్షణీయంగా కనబడదా? సెలయేటి జోలపాట మధురంగా వినిపించదా? నీలసరోవరజలాలలో తమ సౌందర్యాన్ని చూచుకోవా కలువకన్నెలు? ఈ ప్రకృతిలోని సౌందర్యాన్ని ఏ గ్రంథాలు దాచుకోగలవు? మానవహృదయం ఈ సౌందర్యానికి లోబడకుండా ఉండగలదా?" అన్నాడు భైరవశాస్త్రి.

"ఇవి సహజమైనవి. మానవుడికి ప్రకృతికిగల సంబంధం తెంచివేయరానిది" అన్నాడు మాధవరావు.

"సాహిత్యానికి మానవుడికికూడా అటువంటి సంబంధం ఉంది" అన్నాడు భైరవశాస్త్రి.

"ఈ చర్చలకు అంతులేదు. ప్రస్తుతం చెప్పవలిసిన సంగతేమిటంటే, మన భైరవశాస్త్రిగారు ఖండకావ్యం ఒకటి వ్రాశారు. ఎల్లుండి బుధవారంనాడు పాత చాకలిపేట హైస్కూలులో వీరి కావ్యపఠనం ఉంది. నువ్వు రాగలవా?" అని నరసింహాన్ని అడిగాడు మాధవరావు.

"వారు రాకపోతే ఎలా! నా కావ్యంలోని గేయాలు వినాలి. మీరు విమర్శించాలి. ఉభయలు మెచ్చుకోవాలి. అప్పుడు నా శ్రమ ఫలిస్తుంది. అప్పుడే పది దాటినట్లుంది. ఇంకా ఎంతమందితోనో చెప్పవలిసి ఉంది. నాకు సెలవిప్పించండి" అని భైరవశాస్త్రి నిలబడి, నమస్కారంచేసి వెళ్లిపోయాడు.

అతని మీసంలేనిముఖం, కళ్లద్దాలు, బంగాళీచొక్కా, పై మీది వాణీ, పంచెకట్టు పరికించి చూస్తున్న నరసింహం భుజం తట్టి, "ఎప్పుడూ ఇటువంటి వారిని చూడలేదు కాబోలు... వీరు ఆధునిక కవులు" అన్నాడు మాధవరావు.

"ఆహా!"

"ఇంగ్లీషు తెలుగు సంస్కృతభాషలు వచ్చిన వా డితడు. ఇంటరు చదువుతూ మానివేశాడు. తెలుగులో పద్యాలు వ్రాస్తాడు. సంస్కృతంలో బాగా పరిచయం ఉందంటాడు. ఇంగ్లీషులో నిరాఘాటంగా మాట్లాడతాడు. ఈ మూడు భాషలలోగల కవుల పేర్లు, కావ్యాలపేర్లు కంఠతః వచ్చు. మహాకవుల వాక్యాలు ప్రయోగించనిది ఉండలేదు. గాని ఇతని భావాలు వేరు. తెల్లగా కనిపించే ఆవిరి, చూస్తూంటే కరిగిపోయి, ఏమీ లేనట్లు, అర్థమైనట్లు తోచిన వాక్యంలోని అర్థం, రెండవసారి చదివితే మరి స్ఫురించదు. పదాలు మధురమైనవి. నడక సున్నితమైనది. గాని భావం మాత్రం అగమ్యమైనది. ఇది అతని కవిత్వం."

"ప్లీడరుగారు న్యాయశాస్త్రం విడిచిపెట్టి, కవిత్వంలోకి ఎప్పుడు దిగారు?"

"ఏంరా! నన్ను అంత వెంగళప్ప కింద కట్టేశావా?"

"లేదు. గాని ఇంగ్లీషు చదువుకున్నవాళ్లకు తెలుగు వచ్చునా అని సందేహం."

"బి. ఏ. వరకు తెలుగు చదువుకున్నాను కదా! తెలుగులో పోతే పరీక్ష పోయినట్లే కదా!"

"అలాగా!... నువ్వేమేనా వ్రాస్తావా?"

"కవిత్వం రాదుగాని విమర్శ మాత్రం వచ్చును. అప్పుడప్పుడు నా వ్యాసాలు పత్రికలలో పడుతూంటాయి. అందుచేతనే ఈయన ప్రత్యేకంగా నన్ను ఆహ్వానిస్తున్నాడు. కవిత్వం వచ్చినవారికి సహజంగా విమర్శన అంతరాదు. వారు వ్రాసినదంతా బాగానే ఉందనుకుంటారు. మావంటివారికి లోటుపాట్లు కనిపిస్తాయి."

"ఇంతకాలం నీగురించి నాకు తెలియదు. ఇది నా పొరపాటు. కన్నతల్లి మీద అభిమానం ఉన్నట్లు, తెలుగుసాహిత్యంమీద అభిమానం ఉన్నవాళ్లు ఉంటారని నేను తెలుసుకున్నాను. వృత్తికి, సాహిత్యం మీద అభిరుచికి సంబంధం లేదు. మనస్సు ప్రధానం."

"దానికేంగాని... నువ్వువచ్చి రమారమి నెల్లాళ్లయినా రావడం మానేశావు. ఇంటిసంగతులు నాలుగూ చెబుతావని అనుకున్నాను." మాధవరావు ప్రసంగం మార్చివేశాడు.

"అవును, రాలేకపోయాను. మా గురువుగారు శ్రద్ధవహించి ఇంజనుగురించి పాఠాలు చెబుతున్నారు. అందుచేత ఆదివారాలలో కూడా ఖాళీలు లేకపోయాయి. ఈ వారం ఆయన కంచి వెళ్లారు. నేను మీ ఇంటికి..."

"ఏదేనా విశేషం ఉందా ఈ ప్రయత్నానికి?"

"మరో రెండు నెలలలో డ్రైవరు దగ్గిర పనిచేసే రెండవ ఫైర్ మను ఖాళీలు నింపుతారు. అప్పుడు పరీక్షపెట్టి, నెగ్గినవారిని తీసుకుంటారు. ఆయన ఏ విధంగానైనా నన్ను ఆ పరీక్షలో నెగ్గేటట్లు చెయ్యాలని పట్టుపట్టారు."

"నువ్వు చాలా అదృష్టవంతుడివి. లోకంలో చాలామంది తమకోసం బ్రతుకుతారు. ఇతరులకు సహాయం చేసే వీరభద్రయ్యవంటివారు ఉండడం అరుదు. అవకాశాన్ని జారవిడవకు."

ఇద్దరు కొంచెం సేపు మౌనంగా కూర్చున్నారు.

"ప్రొద్దున్న స్నానంచేసి వచ్చావా?" అని అడిగాడు మాధవరావు.

"చేశాను."

"నేను వేగంగా స్నానంచేసి వస్తాను. మనిద్దరం కలిసి భోజనానికి పోదాం."

"అలాగే."

మాధవరావు లోనికి వెళ్లిపోయాడు. ఎదురుగుండా టేబిలుమీద ఉన్న పుస్తకాన్ని నరసింహం చూచాడు. షేక్స్పియరు ట్రాజడీల మీద బ్రాడ్లీ వ్రాసిన విమర్శన అది. హామ్లెట్ నాటకంపై విమర్శన చదువుతూ అక్కడ పెట్టినట్లుంది మాధవరావు. ఒక పది పంక్తులు చదివాడు. హామ్లెటునాటకం చదవకపోవడం నించి తల, తోక అందలేదు. గాని నరసింహం వాక్యాలరమ్యత, భావవిశిష్టతలను గురించి ఆలోచిస్తూ కూర్చున్నాడు.

మాధవరావు బట్టలు వేసుకుంటూ, నరసింహం చేతిలోని ఇంగ్లీషుపుస్తకం చూచి, "నీ కేమైనా అర్థమయిందా, ఇంగ్లీషుపుస్తకం చదువుతున్నావు?" అని అడిగాడు.

"కొంచెం కొంచెం."

"ఒక్కసారి చదువు, విందాం!"

నరసింహం చదివాడు. వాక్యాలు అర్థమిచ్చేటట్టు చదివాడు. ఉచ్చారణలో దోషాలు లేవు.

"ఓరి పిడుగా! ఇంగ్లీషు ఇంగ్లీషులా చదివావురా! ఇంకా వేదవాక్యాలలా చదువుతావని అనుకున్నాను."

"ఇదంతా మా గురువుగారు పడుతున్న శ్రమ ఫలితం."

"చదవడమేనా, అర్థం అవుతూందా ఏమైనా?"

"అంత అన్యాయం లేదు. అర్థమవుతూంది."

"నువ్వు ఇంటిదగ్గిర ఏం చదువుతున్నావు?"

"రైలు ఇంజనుల గురించి ఇంగ్లీషులో వ్రాసిన పుస్తకం."

"లాంబు వ్రాసిన షేక్స్పియరు నాటకకథలు ఇస్తాను. తీసికువెళ్లి చదువు."

"ఇప్పుడు వద్దు. పరీక్ష తరవాత చదువుతాను."

"ఇది చాలా తెలివితక్కువ. ఏకాగ్రత ఉండవచ్చు. గాని విపరీతంగా ఉండకూడదు. నీ మనస్సులో అభిప్రాయాన్ని వెలిబుచ్చడానికి భాష చాలా ప్రధానమైనది. సాంకేతిక గ్రంథాలతోపాటు సాహిత్యగ్రంథాలు కూడా చదివితే బంగారానికి మెరుగుపెట్టినట్లవుతుంది. మెదడుకు మార్పు లభిస్తుంది.

"అవును. పుస్తకం నాకియ్యి. చదువుతాను" అన్నాడు నరసింహం. తరవాత ఇద్దరు భోజనానికి వెళ్లిపోయారు.

## 19

నరసింహం పగటిపూట వండుకొని తినడానికి వీలయ్యేదికాదు. రాత్రికి వండుకునేవాడు. ప్రొద్దున్న పిడికెడు అన్నంలో పెరుగు వేసుకొని తిని వెళుతూండేవాడు. మనిషికి బలం వచ్చింది. ప్రతిరోజు రాత్రి పదకొండు గంటలవరకు చదువుకునేవాడు. తిరిగి పొద్దున్న అయిదు గంటలకు లేచేవాడు.

మొదలియారు అంత శ్రమకరమైన పనులు చెప్పేవాడు కాదు. షెడ్డులో కొంతమంది ఇంజను మరమ్మత్తు చేస్తారు. వాళ్ల దగ్గర నరసింహం కొంతకాలం పనిచేశాడు. వారిలో సూపర్వైజర్లు ఉన్నారు. చదువు అనుభవం గలవాళ్లు వాళ్లలో ఒకరిద్దరు నరసింహానికి విషయం బోధపరిచి ఇంజను భాగాలు చూపించేవారు. చాలామంది సూపర్వైజర్లు దొరలు. దొరలంటే విదేశాల నుండి వచ్చినవారు కారు. నల్లదొరలు. రైల్వే వారి తాతగారి ఆస్తి. ఒకటి రెండు సార్లు నరసింహం జ్ఞానార్జన కోసం వారిని కూడా కలిశాడు. వారికి సరియైన జ్ఞానం ఉందో లేదో భగవంతుడికి తెలియాలి.

ఒకసారి ఒక దొర ‘నా పని కోసం ప్రయత్నిస్తున్నావా?... నాకు చాలా భయం వేస్తూంది’ అని నరసింహంతో అన్నాడు. నరసింహానికి చాలా పౌరుషం వచ్చింది అప్పుడు. అప్పుడా దొరతో అన్నాడు ‘నీ పని ఏ మాత్రం!... నీకన్న పై మెట్టుకే ప్రయత్నం చేస్తున్నాను!’

వీరభద్రయ్య గట్టివాడు. నరసింహం బుఱ్ఱలోఎక్కించిన ఉదాహరణలు పనిచేస్తాయని అతనికి బాగా తెలుసు. చాలా క్లిష్టమైన పరిస్థితిలో జన్మించి విద్యాభ్యాసానికి కూడా అవకాశాలు లేక స్వయంకృషి వల్ల ముందుకు వచ్చి లోకంలో పేరు సంపాదించిన మహనీయుల చరిత్రలు అతనికి చెప్పేవాడు. లోకకల్యాణం కోసం స్వార్థరహితంగా ప్రవర్తించిన మహనీయులను గురించి చెప్పేవాడు. విజ్ఞాన శాస్త్రంలో మన దేశం ఇతర దేశాలకు ఎంత వెనుకబడి ఉందో పురోగమించడానికి మన బాధ్యత ఎంతవరకు ఉందో ఆయన నరసింహానికి బోధపరిచేవాడు.

చిన్నపిల్లాడిలా వీరభద్రయ్య చెప్పిన సంగతులన్నీ నరసింహం ఆసక్తితో శ్రద్ధగా వినేవాడు. మొదట డిసెంబరునెలలో మద్రాసు వచ్చినప్పుడు ఇంగ్లీషులో ఒక వాక్యం కూడా వ్రాయలేకపోయాడు. నేడు కొన్ని వాక్యాలైనా వ్రాయగలడు. మనసులోగల భావం సులువైన మాటలలో పెట్టగలడు. చదవగలడు. అర్థం చేసుకోగలడు. మాట్లాడగలడు.

పాశ్చాత్యసభ్యతను గురించి, సెలక్షనుబోర్డులో అధికారుల ప్రశ్నలకు జవాబులు చెప్పడాన్ని గురించి వీరభద్రయ్య వివరించాడు. అడిగిన దానికి జవాబు చెప్పడం, అనవసరమైన విషయాలు చెప్పకుండా ఉండడం, రాని విషయాలు మర్యాదగా రావని చెప్పడం, ఇవి ముఖ్యమైనవి. అన్నిటికన్నా ముఖ్యమైనది వేషం. వేషంలో పై వారికి నచ్చిన పద్ధతిలో ఉండాలి. అవసరం కోసం వేషం వేసుకున్నట్లు ఉండకూడదు. అలవాటు పడిన వాడిలా ఉండాలి. వేషం మొదట, మాట తరువాత మనిషి విలువ చెబుతాయి. ఇవి ఉద్యోగంలో ముందుకు రావలసిన వాళ్లందరు గమనించవలసి ఉంటుందని వీరభద్రయ్య నొక్కి నొక్కి చెప్పాడు.

గురువు లాగే శిష్యుడు. శిష్యుడుకి నూరిపోసిన అభిప్రాయాలు రూపాన్ని ధరించి నరసింహంలో చాలా మార్పును తీసుకొని వచ్చాయి. బట్ట మాయదు. పంచ కట్టడం అరుదయిపోయింది. సాధ్యమైనంతవరకు తనతో ఇంగ్లీషులోనే మాట్లాడమని గురువుగారి ఆజ్ఞ కావడంనుండి నరసింహానికి ఇంగ్లీషులో మాట్లాడడం అలవాటయింది. తెలుగు ఇంగ్లీషు కలిపి మాట్లాడవద్దని, ఏదో ఒక భాషలో మాట్లాడితే శ్రావ్యంగా ఉంటుందని వీరభద్రయ్య చెప్పాడు. నరసింహం అన్న పాత పేరు తప్ప నరసింహం పూర్తిగా మారిపోయాడు. తండ్రి ఊహించిన ఛాందసవైదికుడు మాత్రం కాలేదు.

తల్లికి డబ్బు పంపవీలవలేదు. డబ్బు జాగ్రత్తగా వాడి, మిగిల్చి, బట్టలు కుట్టించుకున్నాడు. రెండు నెలలు పెరుగన్నం మాని కాలికి జోడు కొనుక్కున్నాడు. వేషం కోసం సౌఖ్యాన్ని కూడా అమ్ముకున్నందుకు నరసింహం అప్పుడప్పుడు తనలో తానే నవ్వుకునేవాడు. ఈ వ్యామోహ బీజాన్ని తనలో పాదుకొల్పిన వీరభద్రయ్య ప్రభావం ఎంత అలంఘ్యమో అని అతను తలపోసేవాడు. ఆరు నెలలు ఈ విధంగా శ్రమపడ్డాడు.

కోర్టులు మూసేవరకు మాధవరావు ఉండలేదు. పిల్లకు మూడవ నెల వెళ్లకుండా బారసాల చేసుకోవాలని వెళ్లిపోయాడు. రెండు నెలలవరకు తిరిగి రానన్నాడు. ఇల్లు వదిలిపెట్టలేదు. ఆ ఇల్లు అమ్మి వేస్తారని విన్నాడు. మదరాసులో ప్రాక్టీసు పెడితే ఇల్లు ముఖ్యంగా అవసరం. ఒక భాగంలో ఉండి, రెండవ భాగం అద్దెకు ఇవ్వవచ్చు, ఇంటి యజమానికి సింహళంలో తేయాకు తోటలు ఉన్నాయి. ఆ దేశంలోనే పెళ్లాడి అక్కడే ఉంటున్నాడు. పిల్లలు అక్కడే చదువుతున్నారు. ఇరవైవేల రూపాయలకు ఇల్లు అమ్మి వేయాలని ఉందని మాధవరావుకు వ్రాశా.డు అతడు ఇల్లు కొనడానికి నిశ్చయించి ఇంటి యజమానిని నవంబరు నెలలో మదరాసు రమ్మని వ్రాశాడు.

మాధవరావు వెళ్లినప్పుడు తల్లికి, చెల్లెలికి ఇమ్మని పళ్లుకొని పంపించాడు. జానకికి రంగురంగుల బొమ్మల పుస్తకాలు పంపించాడు బట్టలు కొని పంపడానికి డబ్బు చాలలేదు.

మే నెలాఖరున అనుకున్న సెలక్షను ఆగస్టు నెల వరకు వెనకబడ్డది. పది ఖాళీలు ఉన్నాయి. నలభైమందిని పిలిచారు వారిలో ఐదుగురు స్కూలుఫైనలు పాసయినవారు. పదిమంది అంతవరకు చదివినవారు. మిగిలినవారు ఇంగ్లీషు రాయడం, చదవడం వచ్చినవాళ్లు. నరసింహం పేరు ఆ జాబితాలోకి రావడం కష్టమైపోయింది. దొర అతని స్కూలు సర్టిఫికేటు అడిగాడు. సర్వీసు ఒక సంవత్సరం మాత్రమే అయినవాడిని ఏ విధంగా పరీక్షకు పంపాలో బోధపడలేదతనికి. నరసింహాన్ని పరీక్షకు పిలిస్తే చాలునన్నాడు వీరభద్రయ్య. పరీక్షలో ఎలాగు ఉత్తీర్ణుడు కానివాడిని పంపి ఏం లాభమన్నాడు దొర. నలభైమందిలో పది మందిని మాత్రం తీసుకుంటారని, మిగిలిన ముప్పయిమంది కాలేనివారేనని వీరభద్రయ్య అన్నాడు. కేవలం వీరభద్రయ్యను సంతోషపెట్టడానికి నరసింహం పేరు జాబితాలో చేర్చాడు దొర.

జిల్లా మెకానికల్ ఇంజనీరు ఆఫీసు వరండాలో నిలబడ్డారు. ఒకరి తరవాత ఒకరు లోపలికి వెళ్లివస్తున్నారు. పది నిమిషాలు, ఐదు నిమిషాలు, పావుగంట ఇలా ఒకరొకరు లోపల జవాబులు చెప్పి బయటికి వస్తున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట అయింది. అధికారులు భోజనాలకు లేచిపోయారు. మిగిలినవారిని మధ్యాహ్నం మూడు గంటలకు రమ్మని చెప్పారు. స్కూలుఫైనలు పాసయినవారు, అంతవరకు చదివినవారు వెళ్లిపోయారు. తక్కువ చదువుగలవారు మాత్రం మిగిలిపోయారు. కావలసిన పదిమందిని ఈసరికి ఎంచుకొని ఉంటారని మిగిలిన వారిలో ఒకడు అన్నాడు. అధికారులు ఆ విధంగా చేస్తే తనవరకు పిలుపే రాదేమోనని నరసింహం అనుమానించాడు.

అధికారులు వచ్చి తిరిగి మూడు గంటలకు పరీక్ష మొదలుపెట్టారు. నాలుగయేసరికి నరసింహం తప్ప మిగిలినవారందరూ పరీక్ష ఇచ్చి వెళ్లిపోయారు. సర్టిఫికేటు లేకపోవడంనించి సర్వీసు చాలా తక్కువ అవడంనించి నరసింహం ఆఖరికి మిగిలిపోయాడు.

నరసింహాన్ని కూడా పిలిచారు లోపలికి. పిలుపు వినగానే నరసింహం గుండె వేగంగా కొట్టుకుంది. పంట్లాం మడత, కోటు మడత సరిచేసుకుని మెల్లిగా ఆఫీసు గదిలోకి ప్రవేశించాడు.

గది కాంతివంతంగా ఉంది. ఎదురుగా మెకానికల్ ఇంజనీరు కూర్చున్నాడు. టేబిలు చివరలలో ఇనస్పెక్టరు, ఫోరుమను కూర్చున్నారు. నరసింహం వారికి ఆంగ్ల పద్ధతిలో నమస్కారం చేశాడు. ఇంజనీరు కాగితాలు చూసుకుంటున్నాడు. ఫోరుమను, ఇనస్పెక్టరును ప్రశ్నలు అడగమన్నాడు. నరసింహం గుండెలు మరింతగా కొట్టుకున్నవి. ఈ పరీక్ష జీవితంలో మొదటిది అవడంనించి కాళ్లు వణికాయి. ఒకటి రెండు నిమిషాల వరకు ఎవరు మాట్లాడలేదు. నరసింహం శరీరాన్ని అదుపులోకి తెచ్చుకుని సమరానికి నిర్భయంగా నిలిచాడు.

ఇనస్పెక్టరు ఆవలించి మొదటి ప్రశ్న వేశాడు

"నీ పేరు?"

“నరసింహం”

“నీదే ఊరు?”

“పాలకొండ తాలూకాలో సంగాం అన్న పల్లెటూరు”

ఈ మాట అంటున్నప్పుడు నరసింహం గొంతుక కొంచెం బొంగురు పోయింది. ఇనస్పెక్టరు పెంకితనంగా ఒక ప్రశ్న వేసి నరసింహాన్ని బయటకి పంపుదామనుకున్నాడు.

“ఈ ఊరు నుంచి మీ ఊరు ఎంత దూరం?”

“రైలు దారి ఐదువందల నలభై రెండు మైళ్లు, బస్సుదారి, బండిదారి పాతిక మైళ్లు.”

కాగితాలు చూస్తున్న ఇంజనీరు నరసింహం ముఖంలోకి చూచాడు. తరవాత మనిషిని మీదనుండి కిందికి చూచాడు.

“నీ మాట నిజమని నేనెలా నమ్మడం?” అడిగాడు ఇనస్పెక్టరు.

“ఆరు నెలల క్రితం నేను మా ఊరు వెళ్లాను. సర్వీసు తక్కువ అవడం నుంచి పాసు దొరకలేదు. టిక్కట్టు కొనుక్కొని ప్రయాణం చేశాను. టిక్కట్టు మీద దాని వెల, దూరం కూడా ఉన్నాయి.”

తరవాత ఒకటి రెండు ప్రశ్నలు రైలు ఇంజను గురించి అడిగాడు ఇనస్పెక్టరు. వాటికి నరసింహం చెప్పిన జవాబులు సరిగ్గా ఉన్నాయి. ఇనస్పెక్టరు ప్రశ్నలు అడగడానికి ఆలోచించాడు. ఇంజనీరు నరసింహాన్ని చూచి అడిగాడు.

“నువ్వేం చదువుకున్నావు?”

“విజయనగరం సంస్కృత కళాశాలలో సంస్కృతం చదివాను. ఉద్యోగంలో చేరిన తరవాత ఇంగ్లీషు నేర్చుకున్నాను.”

“ఆశ్చర్యంగా ఉందే.”

తర్వాత అతను రైలు ఇంజనుకు ముఖ్యమైన ఆవిరిని గురించి, బొగ్గును గురించి, ఇంజను భాగాలను గురించి ప్రశ్నలు వేశాడు. వాటికి నరసింహం చెప్పిన జవాబులకు అతను చాలా సంతోషించాడు.

"అన్ని ఇంజనుల చక్రాలు ఒకే విధంగా ఉంటాయా?" అని ఇనస్పెక్టరు ప్రశ్నించాడు.

"గూడ్సు ఇంజనుల చక్రాలు చిన్నవి. పాసింజరు, మెయిలు ఇంజనుల చక్రాలు పెద్దవి. ఎందుకు ఈ భేదం?"

"అవి చేసే పనులను బట్టి. బరువు లాగవలిసిన ఇంజనుచక్రాలకు పట్టు దొరకాలి. చక్రం వ్యాసం చిన్నదయితే పట్టు దొరుకుతుంది. పాసింజరు, మెయిలు ఇంజనులకు వేగం కావాలి. అందుచేత వాటి చక్రాల వ్యాసం హెచ్చుగా ఉండాలి."

నరసింహాన్ని ఒక్క నిమిషంలో బయటికి పంపుదామని ఇనస్పెక్టరు అనుకున్నాడు. తనకు కావలసిన పది పేర్లు అప్పటికే నిర్ణయించాడు. ఆఖరివాడు ఎందుకు పనికిరాని వాడవడం ఆచారం. ఇంజనీరు నరసింహం చెప్పినవన్నీ వింటున్నాడు. ఏ ప్రశ్నలోనైనా అతనిని ఓడించాలని అనుకున్నాడు ఇనస్పెక్టరు.

"ఇంజను శక్తిని ఏ విధంగా పేర్కొంటారు?"

"హార్సుపవరు యూనిట్లలో"

ఇనస్పెక్టరు నోట పచ్చివెలక్కాయ పడింది.

"మన పాసింజరు ఇంజను ఎన్ని హార్స్ పవర్ యూనిట్ల శక్తి గలది?"

నరసింహం ఒక్క క్షణం ఆలోచించాడు. తనకా విషయం తెలియదు.

"నాకు తెలియదు. నాకు గల తక్కువ అనుభవం చేత జవాబు చెప్పలేనందుకు అధికారులు క్షమాపణ వేడుకుంటున్నాను."

ఇంజనీరు నవ్వాడు. ఇనస్పెక్టరువైపు చూచి అడిగాడు.

"సీనియరు డ్రైవర్లు కూడా ఈ విషయం చెప్పగలరని నాకు నమ్మకం లేదు. ఇటువంటి కొత్తవాడిని ఎలా అడిగారీ ప్రశ్న?"

ఇనస్పెక్టరు మరి మాట్లాడలేదు. ఫోరుమను అంతా వింటున్నాడు. జాబితాలో అనిష్టంగా చేర్చిన ఆఖరివాడు ఇంత చక్కగా జవాబులు చెబుతాడని అతను అనుకోలేదు.

"నరసింహం, నువ్వు కేంబ్రిడ్జిపరీక్షలకు కట్టు. తగిన సర్టిఫికేటు లేనిదే నీకు అడుగడుగునా ఆటంకాలు వస్తాయి. రెండు నెలలు షెడ్డులో ట్రెయినింగయిన తరవాత రెండవ ఫైరుమనుగా నీకు ప్రమోషను దొరుకుతుంది. కేంబ్రిడ్జి పరీక్ష ప్యాసయి సర్టిఫికేటు తెస్తే, నీకు మొదటి ఫైరుమను ప్రమోషను వెంటనే ఇస్తాను. నలభై మందిలో నువ్వు మొదటివాడుగా పాసయావని చెబుతున్నాను. మద్రాసుషెడ్డులో నీవంటి వారు మరొక పదిమంది ఉంటే రైల్వే అంతటికి పేరు తెద్దురు. ఇక నీవు వెళ్లవచ్చు" అని ఇంజనీరు అన్నాడు.

అధికారులకు నమస్కారం చేసి నరసింహం బయటికి వచ్చాడు. జీవితంలో మొదటి విజయపతాకను ప్రతిష్ఠించిననాడు అతని హృదయం ఆనందసంకులమైంది. ముందు వీరభద్రయ్యకీ సంగతి చెప్పి కృతజ్ఞత తెలుపుకున్నాడు. గుండెలమీదనించి ఒక బరువు దింపినట్లయి, మనస్సునుండి ఆందోళన తొలగి ప్రశాంతి లభించింది.

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS